చప్పున నేను అవతల కొక్క గంతేసి పిల్లదాన్ని చేతుల్లోకి తీసుకొని వస్తుండంగా.

"వెళ్లి పొమ్మంటే ఉంటానా ఏమిటంటీ ... మాట వరుసకు అన్నా నిజంగా అన్నానా వెళ్లే పోతావా" అని ఠకీమని తలుపు వేసుకొన్నది.

పసిపిల్ల ఉలిక్కిపడి తల్లికోసం ఒకటే ఏడ్వటం తేలు కుట్టినట్టు.

"తలుపు తీయి..."

"........."

"ఇదిగో నిన్నే..."

"............"

"సరేలే,... పిల్ల చేతుల్లో నిలవటం లేదు.

"........."

"అబ్బహా! దబ్బున తలుపు తీయాలె."

## లేచి పోవాలనుకొంటే.

తలుపు నెట్టుకొని విసురుగా, ఇంట్లోకి ప్రవేశించి అన్నాను. 'నేను వెడుతున్నాను. ఇక మనకు కుదరదులే,' అని.

"నేనేం జేశాను? మీ కంత కోపం రావటానికి! ఏదో సంసారంలో, భార్యాభర్తలన్న తరువాత పోట్లాట్లు లంటూ వస్తే సద్దుకు పోతారుగాని తెంచుకు పారిపోతారా?"

"........................."

"మాట్లాడరేం ? ఎక్కడైనా ఊరుగాని ఇల్లాంటి వైపరీత్యం ? సంసారం గుట్టు, రోగం రట్టు అన్నారు. మీరు నన్నిల్లా అల్లరి పెట్టడం ధర్మం కాదు. అయినా ఇంతకూ నా తప్పేముంది?"

"మళ్ళీ యాకరు పెట్టమంటావా మొదటినుంచీ?"

"వద్దు, బాబూ వద్దు. మళ్లా మొదటికి తీసుకురాకండి."

"అయితే నీవు మాట్లాడక...సుశీ, అట్లా రోడ్డు మీదకెళ్ళి ఒక బండి తీసికొనిరా ?"

"ఉండవే, అమ్మాయ్, అయితే ఎక్కడికి ప్రయాణం ఒక్క మాట చెప్పండి?"

"ఎక్కడికైతే నీకెందుకు ? ఎక్కడికో వెళ్ళిపోతాను."

"బండి తేనా, నాన్నా."

"ఇంకా, ఇక్కడే ఉన్నావుటే?"

"అయితే వెళ్ళి పోవటం నిశ్చయము అన్నమాటే ! "

"నిశ్చయమా అని మెల్లగా అడుగుతున్నావేమిటి ? వెళ్ళిపోతుంటే," అన్నాను దుఃఖాన్ని దిగ మ్రింగుకొని.

"మళ్ళీ ఎప్పుడు వస్తారు ?"

"నీకేం, వేళాకోళంగా ఉందా ఏమిటి ? ఇదే ఆఖరు సారి ఈ ఇంట్లో..........."

అనేసరికి అప్రయత్నంగా నా గొంతుకులోకి సన్నని వణుకు వచ్చింది. ఆ రోజున నేనన్న మాటలు హాస్యానికి కాదు. అట్లా ఒక నాటకం ఆడానని అనుకోలేను.

నిజం. దైవ ముఖాన చెబుతున్నాను. నిజంగా సంసారం త్యజించి పోదామనే ప్రయత్నం. సౌఖ్యం లేకపోయిన తరువాత జీవించటంవల్ల ప్రయోజనం ఏముంది ? అల్లా అని ప్రాణత్యాగం చేసుకోలేము. ఏదో ఇదివరలో సంపాదించి, పెద్దలు ఇచ్చిపోయిన బాపతు ఆస్తివలన జీవనం గడుస్తుంది మా సంసారానికి నేనున్నా, లేకపోయినా.

కాంతం సంగతా అయి పోయినవి సౌఖ్యదినాలు.

ఇకముందు నా జీవితానికి అంతా అమావాస్యే గాని వెన్నెల దినాలు రాబోవు.

పిల్లల సంగతో, భగవంతుడే ఉన్నాడు ! ఎందుకు జీవిస్తున్నట్లు నేను ! సంపాదించి మేడలూ మిద్దెలూ కట్టడం లేదు. సాహేబు సంపాదన బూబమ్మ కుట్టు పోగులకు సరి, అన్నట్లుంది నా సంపాదన. నే జేసే లోకోప కారమా, సున్నాకు సున్నా, హాళ్ళికి హాళ్ళి. ఇంకెందుకు ఈ గంపెడు సంసారాన్ని ఈదటం ? నేను లేక పోయినా గడచి పోతుంది. అంచేత దుఃఖ జనకమై కేవలము మిథ్యయైన ఈ సంసారాన్ని వదిలేసి ఇతర దేశాలలో అజ్ఞాతంగా తిరుగుతూ భక్తిని అలవ రించుకొని, ముక్తిని సాధిద్దామని ఆరోజు నిజంగా అనుకొన్నాను. నిజమంటే నిజం.

"అయితే ? ఆవిడకు మాత్రం నా నిజోద్దేశం చెప్పినా నమ్మ లేదు.

"నిజంగా వెడతారా."

"ఆ..............."

"సరే! వెళ్ళేవాళ్ళను పట్టుకుంటే మటుకు ఆగుతారా? ఒక్కమాట ఇలా చూడండి. పసిదికూడా వస్తుందట! ఎట్లా దూకుతుందో చూడండి! ఒక్కమాటు తీసికోండి!"

"ఒక్క సారి కాదుగదా. అరసారైనా తీసుకోను. సెంప్రుసు పోతున్న వాడిని ఈ ప్రేమ బంధాలతో ఎందుకు కట్టేస్తావు? పోయ్యేవాడ్ని పోనీ, అడ్డురాకు."

"..................."

"నవ్వుతావూ! నీకేం తెలుస్తుంది నాకడుపులో పుట్టిన ఆందోళన, నాకు వద్దు ఈ సంసారం...నరకం...

సంఘుం, శరణం గచ్ఛామి

ధర్మం శరణం గచ్ఛామి

బుద్ధం శరణం గచ్ఛామి

"అబ్బ, ఎంత కఠినమండీ, సాక్షాత్తు బుద్ధదేవుళ్లైపోతున్నారే! బుద్ధదేవుడు కూడా మహాభినిష్క్రమణానికి ముందు భార్యా పుత్రులవంక ఒక్కసారి ప్రేమద్రుక్కులు ప్రసాదించాడు. తెలియదండీ!"

"అయితే సరే, ఒక్కసారి ఇయ్యి. ఒకసారే. ఒక గాఢాలింగనం......ఒక్క చుంబనం......సరి తీసుకో... నన్ను బంధించక......బుద్ధం శరణం గచ్ఛామి......

"రావటం లేదు. మీా దగ్గరనుంచి."

"తీసుకో...ఇంద...ఊఁ."

"రావంటుంటే...దాన్నికూడా తీసికెళ్ళండి. జాగ్రత్తగా పెంచండి. శిష్యురాలౌతుంది!"

"మరేం అక్కర్లేదు...ఇంద"

"నిజంగా వెళతారా?

"వెళుతుంటేనే...పిల్లలను జాగ్రత్తగా పోషించుకో. అప్పున్నది చాలు, లేదనకుండా గడవటానికి, అని గిరుక్కున తిరిగాను. ఇటు చూడనుగదా పిల్లలంతా ఎక్కడికో ప్రయాణ సన్నాహంలో ఉన్నారు." కాంతంతో అన్నాను.

"వీళ్ళను నామీదికి తోలేవేమిటి? వీళ్ళను తీసుకుపో. నేను వెళ్ళిపోతాను. ఈ చివర రోజునకూడా నీవు నాకు అనుకూలవతివి కావూ?'' అన్నాను కంపిత కంఠంతో.

''వారు నామాట వినరు. మీరే చూచుకోండి ఆ విషయం.'' అంటూ కాంతం చరచర నడిచిపోయింది.

"ఒరేయి ఏమిటిది బూడ్సులు తొడుగుతున్నావెందుకు?"

"నేనూ, వస్తానానాన్నా."

"అదేమిటే అమ్మాయి?"

"........."

"నువ్వెక్కడికే సుశీ?"

"........."

"నువ్వెందుకురా, లక్ష్మి చిందు వేస్తావు?"

"నేనూ, వస్తాను నాన్నా.

"నేనూ......"

"నేనూ...నాన్నా"

"నేనో......"

"ఉ...ఉ...ఉ...ఉ ..."

,,ఓరి వెధవల్లారా. ఎక్కడికి వస్తారు. ఎక్కడికిరా వస్తారూ అంటూ? అమ్మ ఉస్సా చేసింది. పొండి?"

,,ఉహు...ఉహు...ఉహు"

,,ఎక్కడికి వస్తావురా?"

,,నీవు ఎక్కడికి వెళుతున్నావు?"

,,నేను వెళ్ళిపోతున్నాను"

,,ఉ...ఉ..."

,,నేను...వస్తా...నాన్నా..."

,,ఓరి వెధవా నేను సంసారం వదిలేస్తున్నా."

,,నేను వదిలేస్తా నాన్నా..."

,,ఓరి గాడిదా, సన్యాసం పుచ్చుకొంటానికి వెడుతున్నానురా'' అన్నాను విసుగ్గా...''

,,నేనూ, పుచ్చుకొంటా నాన్నా'' అన్నాడు మా అయిదేండ్ల చిన్న వెధవ.

,,నేనో నాన్నా అని ఒక్కముఖం వేసింది సుశీ''

ఈచిన్న వెధవలంతా నాతోపాటు సన్యాసం పుచ్చుకుంటామంటూ బయలు దేరారు. బుద్ధదేవుడికి ఒక్కకొడుకు కాబట్టి తెంచుకు పారిపోయినాడు. అదీ నిద్రపోతున్నప్పుడు! అదీ అర్ధరాత్రి! అసుర సంధ్యవేళ అరడజను పిల్లలను వదలించుకొని వెళ్ళవలసి వచ్చినట్లయితే తెలిసేది, ఈసంసారానికి మానవుడు ఎట్లా కట్టబడి ఉన్నాడో!

కుర్చీలో కూలబడ్డాను కదలకుండా మెదలకుండా. పిల్లలు నా ముఖంవంక చూశారు. నేను నవ్వకుండా, గంభీరంగా ఉండటం చూచి పెద్దపిల్లలు ఒక్కొక్కరే జారారు.

చిన్నవాళ్లు ఏడుస్తూ, తల్లిదగ్గరకు పోయినారు. కళ్లు మూసికొన్నాను.

చెన్నుడు కోటవెలుపల గుర్రాన్ని తయారుచేసి ఉంచి సిద్ధంగా ఉన్నట్లూ, బుద్ధదేవుడు గంభీర వదనంతో, భార్యా పుత్రాదులను, ధనసంపదలనూ, సర్వమూ త్యజించి, ఆతురలో వస్తూ ఉన్నట్లు, నాకొక దృశ్యం కనపడ్డది. బుద్ధదేవుడ్ని ప్రార్థనచేసి, నేనూ, ఒక్కసారు, ఇంటిని నాలుదిక్కులా చూచి, నిట్టూర్పు విడిచి, గుమ్మందాటి బైటపడ్డాను ఈవిశాలమైన ప్రపంచంలోకి.

వీధి మలుపు తిరిగాను బుద్ధదేవుడ్ని ధ్యానిస్తూ. వెనకాలనుంచి కెవ్వున కేకేసి పరుగెత్తికొని వస్తున్నారు రాధా విజయులు. పెద్దవాడు లాగూ, చొక్కా, కోటూ వేసికొని, బూట్సులు తొడుక్కొని, చెమ్కీటోపీ పెట్టుకొని నాకు నాల్గు గజాల దూరంలో ముందు నడుస్తున్నాడు,—నేను రావటాన్ని గమనిస్తూ, మాటిమాటికి వెనక్కు తిరిగి చూస్తున్నా. పెద్దపిల్లలిద్దరూ కొత్తపరికిణీలు కట్టుకొని కొత్తచొక్కాలు తొడుక్కున్నారు. వాళ్లమ్మ నడిగి తీసుకొన్నారు కాబోలు బంగారు గొలుసులు మెడలో మెరుస్తున్నవి. దూరంగా రోడ్డు మీద నుంచుని నేను పోవలసిన దారినే ముందుగా గబగబ నడుస్తున్నారు. త్రిరత్నాలను నేను మరోసారి స్మరించుకొన్నాను.

వీళ్లం జూచి నేను తెల్లబోయినాను. అమ్మాయీలను పిల్చి 'వెళ్లండే యింట్లోకి' అన్నాను. వాళ్లు "మేము వేరే

పనిమీద వెడుతున్నాము ఇంకోచోటికి. నీతో రావటం లేదు'' అని కిలాకిలా నవ్వుతూ దూరంగా నుంచున్నారు.

"నువ్వెక్కడికిరా పోరా" అన్నాను దగ్గరనున్న వెధవతో.

"నేను వస్తాను నాన్నా,'' అని మళ్లీ అన్నాడు వాడు బిక్కమొఖంవేసి.

"నేను ఎక్కడికి వెడుతున్నా ననుకొంటున్నావురా,'' అన్నాను.

"అమ్మ చెప్పిందిలే నాన్నా. అక్కయ్యలు రావటం లేదేం? అనుగో వాళ్లు నీకంటె ముందే అక్కడుంటారు.''

"ఎక్కడుంటారురా?''

"అక్కడే!...''

"ఎక్కడరా! ఏమని చెప్పింది అమ్మ.''

"..........''

"నేను వస్తాను నాన్నా, మొన్నకూడా రాలేదూ''

"ఎక్కడికి వెడుతున్నా ననుకుంటున్నావు చెప్పవే ?''

"అమ్మ చెప్పిందిలే నాన్నా నీవు సినిమాకు వెడుతు న్నావని''

"ఆ...ఆ...''

తెల్లబోయినాను. పిల్లలిద్దరూ కాళ్లకు చుట్టేసుకొని ఏడుస్తున్నారు. ఆ వీధిలోని ఆడవాళ్లు కిటికీలోనుంచి చూస్తు న్నారు. అసహ్యా మనిపించింది. పసిదాన్ని, చిన్నవాడ్ని, రెండు చేతుల్లో యెత్తుకొని మళ్లీ గుమ్మంలోకి వచ్చేను. పెద్ద

వెధవ ఇష్టంలేక మెల్లగా అడుగులో అడుగు వేస్తున్నాడు నా వెనకాల. నేను గుమ్మందగ్గరకు వెళ్లి తలుపు కొట్టాను.

"ఎవరది? చెయ్యి ఊరుకోలేదు వెళ్ళండి."

"తలుపు, తలుపూ"

"........."

"తలుపూ, అయ్యో, తలుపుతియ్యవే!"

"ఎవరా, తలుపూ"

"నేనే..."

"అంటే..."

"అబ్బ... నేనే"

"ఎందుకూ?"

"తీయి, చెబుతా?"

"ఏమిటి చెప్పేది? సంసారంపైన విరక్తి పుట్టిపోయిన వాళ్ళకు అప్పుడే ఇదేం వికారం?"

"కాదులే, చెబుతా, తలుపుతీయి"

"కాదేమిటి? చెప్పేదేమిటి! మళ్లా ఎందు కొచ్చారు? ఈ కూపంలోకి; వెళ్లండి, వెళ్లండి."

"ఒక్క మాట."

"మాటా లేదూ, గీటా లేదూ, వెళ్లండి."

"మాట, మాటంటుంటే."

"ఇంకేం మాటలు లెద్దురూ?"

"అబ్బ చాల్లే! తలుపుతీయి, చేతులు పీకుతున్నాయి" అన్నాను.

మా అబ్బాయి "వద్దు నాన్నా, వెడదాం రా నాన్నా అమ్మ తీయకపోతేఏం? భయమా?" అన్నాడు.

"ఇంకేం, వెళ్లండి, కొడుకు చెబుతున్నాడుగా సలహా" అంటూ తలుపుతీసింది కాంతం.

"ఎందుకూ, మళ్లీ వచ్చారు?" అన్నది అణచిపెట్టుకొన్న నవ్వు ముఖం అంతా కలయబారింది.

"మరి వీళ్లంతా?"

"నన్నేమి చేయమంటారు?"

"నువ్వు చేసిందే కాదూ, ఇదంతా?"

"ఈ మాత్రం జయించలేని వాళ్లేనా, ప్రపంచాన్ని జయించటానికై బయలుదేరారు?" అన్నది ఈసడింపుతో హసి దాన్ని అందుకొంటూ.

"నిజమే లే! ఇకలే అడ్డం...అన్నాను విసుగ్గా."

"ఊహు..."

"అదేమిటి అల్లాగ నుంచుని లేవవు...పేరు చెప్పిస్తావా ఏమిటి?"

"అటువంటిదే..."

"ఏమిటది?"

"ఒప్పుకోండి, ఓడిపోయినానని."

"సరే, ఓడిపోయినాను. ఇక లే! వీధిలో ఆడవాళ్లందరూ కిటికీలలోనుంచి చూస్తున్నారు."

" లేకాదు. హ్యాండ్స్ అప్, (Hands up) నెపోలియన్ ఓడిపోయి ఆంగ్లేయుల ఎర్ర పతాకానికి సలాంచేసి చేతులెత్తలా! అట్లా!"

"చిత్తం", అని సలాంచేశాను. గాలికి కాంతం పమిట విప్పారి టపటప కొట్టుకొన్నది.

...............

"ఏమిటది?"

"ఏం లేదు, పత్రాలు గూండాకు చేరుతూ కిచకిచలాడుతున్నాయి"

"కాదు, కాంతం, ఎవరో నవ్వుతున్నారు."

"కాదు రండి."

దభీలుమని తలుపు వేసింది కాంతం.

# కిటికీకి అవతలా ఇవతలా.

ఆవిడా...అదె మా యింటి ప్రక్కావిడ నిజంగా చక్కనిది. మామిడి పండులాగ ఉంటుంది. మిగల పండిన తమలపాకు పచ్చని శరీరచ్ఛాయ. లేకపోతే పండిన జామపండులాంటి దసండి. కిటికీ అవతల దూరాన ఉన్నాకూడా, నిదుపై సుందరమైన ఆ ముక్కూ ఆ కోలముఖమూ అద్దంలో లాగ నాకు కనిపిస్తున్నయి. బుజాలపైకి రైక తొడుక్కుంది కాబట్టి నున్నగా నిగనిగ లాడుతూ ముట్టుకో తగినట్టి మార్దవము కనిపించే ఆ చేతులనూ, మామిడి చిగుళ్ళలాగున్న ఆమె పాదాలనూ, మరచిపోయినా, విశాలమై తళతళ లాడుతూ ఉన్న ఆమె విసీల నేత్రాలనూ, చూస్తూ ఆలా ఉండి పోయినాను.